నందనవనం.. ఆధ్యాత్మిక పరిమళం

- ప్రశాంతతకు చిరునామాగా ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు
- విశాఖలోనే మొట్టమొదటి వివేకానంద మండపం ఏర్పాటు
- పార్కు అభివృద్ధికి వీవీవైఎం సభ్యుల నిరంతర కృషి

మురళీనగర్: ఆధ్యాత్మిక పరిమళాలకు నెలవు మురళీనగర్. ఇక్కడి ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో ప్రవేశించే వారికి ఆహ్లాదం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మికత లభిస్తాయి. సెక్టార్–3లోని ఈ పార్కులో అనేక ఆధ్యాత్మిక మందిరాలను నిర్మించారు. దీని అభివృద్ధికి స్థానికులతోపాటు విశాఖ వివేకానంద యువ మహామండలి(వీవీవైఎం) సభ్యులు నిరంతరం కృషి చేస్తున్నారు. ముఖ్యంగా ఈ పార్కులో నిర్మించిన వివేకానందుడు మండపం విశాఖలోనే మొట్టమొదటిగా చెప్పుకోవచ్చు. యువతను ఉన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను ఇక్కడ నిర్వహిస్తున్నారు.

దైవ, మహాపురుషుల మందిరాలు..

ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు పేరుకు తగ్గట్టుగానే సందర్శకులకు మానసిన ప్రశాంతతను అందిస్తోంది. ఇక్కడి ఆధ్యాత్మిక మందిరాలను దర్శించుకుని, పచ్చని ఆహ్లాదకర వాతావరణంలో కాసేపు కూర్చుంటే మనసుకు స్వాంతన కలుగుతుంది. పార్కులో వినాయకుడు, మురళీకృష్ణుడు, ధ్యాన ముద్రలో ఉన్న ఆంజనేయుడు, దక్షిణామూర్తి రాతి విగ్రహాలు ఉన్నాయి. వీటికి మందిరాలు నిర్మించారు. రామకృష్ణ పరమహంస, శారదామాత విగ్రహాలతోపాటు షిర్డీసాయిబాబా, శంకరాచార్యుల పాలరాతి విగ్రహాలను దర్శించుకోవచ్చు.


ఆధ్యాత్మిక పార్కులో వివేకానందుడి మండపం

ప్రత్యేక ఆకర్షణగా వివేకానంద విగ్రహం


వివేకానందుడి నిలువెత్తు విగ్రహం

పార్కు ఆధ్యాత్మిక మండపంలో ఏర్పాటు చేసిన వివేకానందుడి నిలువెత్తు విగ్రహం సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ మందిర నిర్మాణానికి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. రూ.50 వేల తో వివేకానందుడి విగ్రహం ఏర్పాటు చేశా రు. గ్రంథాలయం, వాచ్‌మన్ గది, టాయిలెట్‌లను నిర్మించారు. దీనికి వివేకానంద యువ మహామండలి పూర్వ అధ్యక్షుడు దివంగత ఎస్.లక్ష్మీనారాయణ రూ.10 లక్షలు తన సొంత నిధులు ఖర్చు చేశా రు. ఈ భవనాన్ని 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఇటీవల ప్రారంభించారు. పార్కు సభ్యులు విరాళాల ద్వారా వాచ్‌మన్ జీతాలకు చెల్లిస్తున్నారు. నూతన గేటు ఏర్పాటుకు వివేకానంద యువ మహామండలి సభ్యులు విరాళం అందించారు. పార్కు అభివృద్ధిని జీవీఎంసీ అధికారులు, స్థానిక నాయకులు పట్టించుకోకపోవడంతో పార్కు నిర్వాహకులే అంతా తామై చూసుకుంటున్నారు.


మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో నిర్మించిన మందిరాలు

ఆధ్యాత్మిక కార్యక్రమాలు..

- ఈ పార్కులో సందర్భానుసారంగా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. యువత కోసం ప్రత్యేకంగా వివేకానందుడి స్టడీ సర్కిల్‌ను ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నారు.
- ప్రతి రోజు ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు రిటైర్డ్ ఎస్ఐ నాయుడు ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, యోగా తరగతులు ఉచితంగా జరుగుతున్నాయి.
- ఏకాదశి రోజున రామకృష్ణుడి ఆరాత్రికం, మహిళల ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామం, భగవద్గీత, హనుమాన్ చాలీసాలు పఠిస్తారు.
- వివేకానందుడి జయంతి సందర్భంగా ఏటా జనవరి 12న యువజన దినోత్సం, భారీ ఎత్తున యువజన చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్నారు.
- ప్రతి ఏడాది రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

జీవీఎంసీ సహకరించాలి



2011లో ప్రశాంతి పార్కులో ఆధ్యాత్మిక మందిర నిర్మాణానికి జీవీఎంసీ రూ.19.96 లక్షల అంచనా వేసింది. నేటికీ వారి వాటా రూ.7.30 లక్షలు చెల్లించలేదు. దీని కోసం చేసిన అప్పులు ఇప్పటికీ తీర్చలేకపోతున్నాం. జీవీఎంసీ సహకరించి బకాయిలు చెల్లిస్తే అప్పులు తీర్చుకుంటాం. నిధుల కొరతతో పార్కు అభివృద్ధి పనులు కొన్ని ఆగిపోయాయి. జీవీఎంసీ అధికారులు ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తే పార్కును మరింత అభివృద్ధి చేస్తాం.

– ఆర్.భాస్కరరావు, పార్కు ఉపాధ్యక్షుడు

ఆకట్టుకున్న కార్టూన్లు


ప్రదర్శనలో ఉంచిన కార్టూన్లు

మురళీనగర్: ఉగాది సందర్భంగా మురళీనగర్ టెన్నిస్ పార్కులో స్పోర్ట్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఉత్తరాంధ్ర కార్టూనిస్టుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం కార్టూన్‌ల ప్రదర్శన నిర్వహించారు. వివిధ రంగాలతోపాటు సమకాలీన అంశాలను ప్రతిబింబిస్తూ కార్టూనిస్టులు వేసిన కార్టూన్లు ఆకట్టుకున్నాయి. కార్టూనిస్టులు రామశర్మ, వందన శ్రీనివాస్, టీఆర్ బాబు, వర్మలాల్ వేసిన కార్టూన్లు ప్రదర్శనలో ఉంచారు. చిన్నారులు అత్యధికంగా పాల్గొని ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా కార్టూనిస్టులను సత్కరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో అన్నదాన సేవ

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఉగాది సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ అన్నదానం ప్రారంభించి 13 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భక్తులు, పేదలకు ప్రత్యేక అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

దుర్గాగణపతి ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు


మజ్జిగ అందిస్తున్న కె.కె.రాజు

సీతంపేట: సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయం వద్ద యశోదకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం దీనిని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ముఖ్య అతిథిగా ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా 25వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఆయన దుర్గాగణపతిని దర్శించి పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో యశోదకృష్ణ సేవా సంఘం అధ్యక్షుడు ముద్దాడ ఎల్లాజీ, కార్యదర్శి బీసపు శ్రీను, ముద్దాడ శంకర్, జోగ శ్రీనివాస్, నల్లా చిన్న, ఒమ్మి ఆనంద్, పల్లా పాపారావు, సీర రవి, ముగడ విజయ్, పల్లా రాము, స్థానిక నాయకులు భోగవిల్లి గోవింద్, హరికృష్ణ పాల్గొన్నారు.

కిటకిటలాడిన రైతుబజార్


సీతమ్మధార రైతుబజార్‌లో వినియోగదారుల రద్దీ

సీతమ్మధార: ఉగాది పండగ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి సీతమ్మధార రైతుబజార్ వినియోగదారులతో కిటకిటలాడింది. పువ్వులు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, అరటిపళ్లు, చెరుకుగడలు, వేపపువ్వు, మామిడి కాయలు ఇలా పూజ సామగ్రి కొనుగోలు చేశారు. రైతుబజార్ సహాయకుడు సతీష్ సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలు జరగకుండా పర్యవేక్షించారు. బజారు మొత్తం వినియోగదారులతో నిండిపోవడంతో జేబు దొంగలు చేతివాటం చూపారు. ఒక వ్యక్తి జేబులోంచి రూ.10 వేలు దొంగిలించారు. దీంతో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కార్యాలయంలో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

ఘనంగా రాట ఉత్సవం


రాట వేస్తున్న మహిళలు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్–2 యువసేన సంఘం ఆధ్వర్యంలో భద్రాద్రి సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఈ నెల 31 వరకు 12వ వార్షిక వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో సీతారామ కల్యాణ వేడుకలకు పందిరి రాట ఘనంగా వేశారు. ఈ నెల 22 నుంచి 31 వరకు విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. 30న ఉదయం స్వామివారి కల్యాణ వేడుకలు నిర్వహించి అనంతరం అన్నదానం చేస్తామన్నారు. 31న వసంతోత్సవం నిర్వహించి చక్రస్నానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

47వ వార్డులో..


బర్మాక్యాంప్‌లో రాట వేస్తున్న కమిటీ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు జైభారత్‌నగర్ బర్మా క్యాంప్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సీతారాముల పెళ్లి రాట కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 30 శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామన్నా రు. మూర్తా పోరాట వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్.ఆదినారాయణ, ముక్కల ప్రసాద్, ఆడ్డాడ శ్రీను, బి.మహేష్, రాజు, గణేష్, వాసు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి శ్రీకారం


కలశ స్థాపనలో పాల్గొన్న కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్

సీతంపేట: తెలుగు సంవత్సరాది ఉగాది తర్వాత వచ్చే తొలి పండగ శ్రీరామనవమి ఉత్సవాలకు భక్తులు శ్రీకారం చుట్టారు. సీతంపేటలో సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాలు ఉగాది రోజున ఘనంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు నిర్వహిస్తున్న ఈ కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం మేళతాళాలు, అర్చకుల మంత్రాల నడుమ ముత్తయిదవులు పార్వతీశ్వరాలయం వద్ద పెళ్లి రాట వేశారు. అనంతరం సీతారామలక్ష్మణులు, హనుమంతుల పంచలోహ ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం, మంగళ స్నానాలు చేయించారు. విగ్రహాలను పట్టువస్త్రాలు, పూల దండలతో అలంకరించి మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం పార్వతీశ్వరాలయంలో కలశ స్థాపన చేసారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25 వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు అతిథులుగా పాల్గొని ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకుడు సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 30న పార్వతీశ్వరాలయం వద్ద సీతారాముల కల్యాణం, సాయంత్రం ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి విశేష పూజలు


వైభవుడి ఆలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


కోలాటమాడుతున్న మురళీనగర్ మహిళలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శోభకృత్ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారికి ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ చేసి రజిత కవచధారుడిగా అలంకరించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలన్నీ కోలాహలంగా మారాయి. మురళీనగర్ మహిళలు కోలాటమాడి ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం 600 మందికి అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు శేషు స్వామి పంచాంగ శ్రవణం వినిపించారు. భక్తులు తమ పేరు బలాలు, ఆదాయ, వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వామికి విశేష హారతి సమర్పించారు. ఆలయం ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉగాది పురస్కారాల ప్రదానం


ఉగాది పురస్కారాలు అందుకున్న కవులు, ఇతర ప్రముఖులు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురంలోని సీతారామ కల్యాణ మండపంలో పోర్ట్ సాంస్కృతిక సంస్థ సాగరి ఆధ్వర్యంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథి పోర్ట్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ ఆర్.ఎస్.హరికృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోర్ట్ రిటైర్డ్ హిందీ అధికారి పి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పి.ఫ్రాన్సిస్ కవి సమ్మేళనాన్ని నిర్వహించగా.. ప్రముఖ కవి డాక్టర్ కేజీ వేణు సమీక్షించారు. ప్రముఖ వ్యాఖ్యాత పి.అభిషేక్‌ను ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త, పంచాంగ కర్త అడబాల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. 40 మంది కవులు, కవయిత్రులు కవితలను వినిపించారు. పోర్ట్ రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ ఆర్ రాములు, సాగరి వైస్ ప్రెసిడెంట్ అవతారం నాయుడు, కార్యదర్శి ధర్మారావు, కార్యవర్గ సభ్యులు శ్రీధర్, చంద్రరావు, సత్యారావు, సూరిబాబు, అప్పారావు పాల్గొన్నారు.


78 మంది యువకుల రక్తదానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్‌లో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతానికి చెందిన రేపాక సాయితేజ అనే యువకుడి తొలి వర్ధంతి సందర్భంగా అతడి కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. సుమారు 78 మంది యువకులు రక్తదానం చేశారు. ముందుగా సాయితేజ చిత్రపటానికి కార్పొరేటర్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

వేడుకగా ఉగాది


గంగా, గోదావరి అపార్ట్‌మెంట్‌లో ఉగాది సంబరాలు


పంచాంగ శ్రవణం వినిపిస్తున్న రొంపిచర్ల శింఘురా ఆచార్యులు, చంద్రశేఖర శర్మ

- శోభకృత్ నామ సంవత్సరాదికి ఘన స్వాగతం
- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

సీతంపేట: నియోజకవర్గంలో బుధవారం శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతంపేటలోని దుర్గాగణపతి, పార్వతీశ్వరాలయం, గురుదత్త సాయి ఆలయం, అక్కయ్యపాలెంలోని లలితా పీఠం, షిర్డీసాయి మందిరం, జగన్నాథపురంలోని నూకాలమ్మ ఆలయాల వద్ద ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. దుర్గాగణపతి ఆలయంలో గణపతి హోమం, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక అలంకరణ గావించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం చేపట్టారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో సకుటుంబ సమేతంగా ఇష్టదైవాన్ని దర్శించి అర్చనలు, అభిషేకాలు జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థప్రసాదాలు అందజేసింది.

లలితా పీఠంలో..

లలితానగర్ లలితా పీఠంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో లలితా పరమేశ్వరికి క్షీరాభిషేకం, సాయంత్రం పీఠం దర్బారు హాల్లో నారాయణ బృందంచే నాదస్వర కచేరీ, రొంపిచర్ల శింఘురా ఆచార్యులచే పంచాంగ శ్రవణం, అనంతరం తిరుమల పెద్దింటి నరసింహాచార్యులచే రామాయణ విశేషాలతో ప్రవచనం నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థప్రసాదాలు అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంబరాలు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, యువజన విభాగం ఇన్‌చార్జి సునీల్, కిరణ్‌రాజు, వార్డు అధ్యక్షులు నీలి రవి, ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి దేవాలయంలో..

నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉగాది పూజలు నిర్వహించారు. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ సిబ్బంది శివ, భక్తులు పాల్గొన్నారు.

కలియుగ వేంకటేశ్వరాలయంలో..

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెంలో కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి జగన్నాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో భక్తులకు ఉగాది పచ్చిడి అందజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసు దేవరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పార్టీ కార్యాలయంలో పూజలు చేస్తున్న కె.కె.రాజు, నాయకులు


నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో సాయిబాబాకు భక్తుల పూజలు

మురళీనగర్‌లో సందడి..

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.చంద్రశేఖరశర్మ తెలుగు నూతన సంవత్సర పంచాంగ శ్రవణం వినిపించారు. వివిధ రాసుల జన్మనక్షత్రాలతో పేరు బలాలలను వివరించారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్యరంగ సామ్రాట్, వికటకవి బిరుదాంకితుడు, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన కోరుకొండ రంగారావు బృందం నిర్వహించిన హాస్య వల్లరి నవ్వుల జల్లులు కురిపించింది.

- మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పార్కు సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ననపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. అయిలూరి శ్రీనివాస దీక్షితులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఘంటసాల గానావధానం, సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు.
- వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శేషాచార్యులు, దాసాంజనేయ స్వామి ఆలయంలో ఆరవిల్లి సీతారామాచార్యులు, యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో ఆరవిల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం జరిపారు.
- బిర్లా కూడలి సమీపంలోని గంగా, గోదావరి అపార్ట్‌మెంట్ సముదాయంలో స్థానిక నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మణశర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. సంఘ నాయకులు, నివాసులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


మృతుడు

సింహాచలం: పెందుర్తి రైల్వేస్టేషన్ సమీ పంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద రైల్వే పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు విశాఖ జీఆర్‌పీ ఎస్ఐ బి.కామేశ్వరరావు తెలిపారు. సుమారు 75 ఏళ్ల ఉన్న వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో మృతిచెందినట్టు తెలిపారు. నీలం రంగు నిక్కర్, కనకాంబరం రంగు హాఫ్ హ్యాండ్ షర్టు ధరించి ఉన్న వ్యక్తి మొలతాడుకు బీరువా తాళం చెవి ఆకారం కలిగిన తాళాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 8985752107 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సామాన్యులకు నటనలో శిక్షణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాయుడు

సీతంపేట: సామాన్యులకు నటనలో శిక్షణ ఇవ్వాలనే సదుద్దేశంతో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించామని డైరెక్టర్ ఎస్.టి.నాయుడు తెలిపారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద షిర్డీసాయి స్కూల్ ఎదురుగా డాక్టర్ ఎస్.టి.నాయుడు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, డ్యాన్స్ అకాడమీలను బుధవారం ఆయన ప్రారంభించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నటనపై ఎంతోమందికి ఆసక్తి ఉన్నా ఆర్థిక స్తోమత లేక చాలా మంది వెనుకంజ వేస్తున్నారన్నారు. ప్రస్తుత రోజుల్లో నటనలో శిక్షణ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని విశాఖ నగరంలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ సంస్థలో యాక్టింగ్, స్క్రిప్ట్ రైటింగ్, యాంకరింగ్, డైరక్షన్, డ్యాన్స్‌ల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. మూడు నెలలు థియరీ, మరో మూడు నెలలు హైదరాబాద్‌లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణలో ప్రతిభ చూపిన నటీనటులతో సొంతంగా సినిమా నిర్మిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 85558 40515 నంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ నాయుడు కోరారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ కె.జయలక్ష్మి పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో జల దినోత్సవం


కృష్ణా కళాశాలలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో అంతర్జాతీయ జల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో వనం–జలం పేరిట ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కళాశాల హరిత ఏకో క్లబ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వనం–జలం –మన ఆరోగ్యం అనే నినాదంతో అందరూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హరిత ఏకో క్లబ్ కో ఆర్డినేటర్ డి.ఎస్.మాధవరావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీవాణి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్య దేవత బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. అనంతరం ఆన్‌లైన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలని ఆలయ అధికారులు కోరారు.